క్లుప్తంగా

యోగాసనాలపై అవగాహన



యోగాసనాలు సాధన చేయిస్తున్న ఎంఈఓ

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం యోగాసనాలపై ఎంఈఓ–2 మునిసుబ్రమణ్యం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ యోగా మనిషి జీవితంలో భాగం కావాలని, సంపూర్ణ ఆరోగ్యం యోగాతోనే సాధ్యమని తెలిపారు. యోగా సాధనతో మానసిక సమస్యలు, శారీరక రుగ్మతల నుంచి విముక్తి లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమణయ్య, గ్రామ కార్యదర్శి సుబ్రమణ్యం పాల్గొన్నారు.

పల్లికొండేశ్వరస్వామి సేవలో నటుడు యోగిబాబు



యోగిబాబును ఆశీర్వదిస్తున్న అర్చకులు

నాగలాపురం: మండలంలోని పల్లికొండేశ్వర స్వామివారిని తమిళ సినీ హాస్య నటుడు యోగిబాబు బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు యోగిబాబును ఆశీర్వచనం పలికి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం స్వామివారి చిత్రపటం బహూకరించారు.

కమనీయం ద్రౌపదీదేవి కల్యాణోత్సవం



విశేషాలంకరణలో ద్రౌపదీ, ధర్మరాజులు

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురంలో జరుగుతున్న శ్రీకృష్ణ ద్రౌపదీదేవి సమేత ధర్మరాజ స్వామి 51వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయంలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం కమనీయంగా జరిగింది. స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి, వేదమంత్రోచ్చారణల నడుమ కల్యాణోత్సవం జరిగింది. మహిళలకు పసుపు, కుంకుమ అందజేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

శ్రీకాళహస్తి: పట్టణంలో ఇటీవల మృతి చెందిన వార్త విలేకరి మెహర్‌కుమార్ కుటుంబ సభ్యులకు బుధవారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో అతనితో చదివిన స్నేహితులు (పూర్వవిద్యార్థులు) రూ.90 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ముందు ఏ సాయం కావాలన్నా ఇస్తామని భరోసా ఇచ్చారు.

ఏఓగా త్రివిక్రమ్‌రావు

సత్యవేడు: మండల పరిషత్ పరిపాలన అధికారిగా పి.త్రివిక్రమ్‌రావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. బుచ్చినాయుడు కండ్రిగలో ఏఓగా పనిచేస్తున్న ఆయన బదిలీపై సత్యవేడుకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఏఓ మోతి బుచ్చినాయుడుకండ్రిగకు బదిలీపై వెళ్లారు. కార్యాలయ సిబ్బంది ఆయనకు శాలువా కప్పి సన్మానించారు.



వరదయ్యపాళెం: జూనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న నూకతోటి రాజేష్



శ్రీకాళహస్తి: ప్రజలకు అడుక్కునే పరిస్థితి వచ్చిందని హావభావాలు ప్రదర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే

రాష్ట్రంలో సంక్షామం

ఆరువందల అబద్ధపు హామీలతో కూటమి గద్దెనెక్కి ఏడాది పూర్తి అయినా వాటిని అమలు చేయని చంద్రబాబు వైఖరికి నిరసనగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి, వరదయ్యపాళెంలో నిర్వహించిన వెన్నుపోటు దినం కార్యక్రమం విజయవంతమైంది. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి బ్రహ్మరథం పట్టారు. ర్యాలీలు, నిరసనలతో హోరెత్తించారు.

- మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి
- సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్

శ్రీకాళహస్తి: సీఎం చంద్రబాబు ఎన్నికల హామీలను అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడిచారని, దీంతో రాష్ట్రంలో సంక్షేమం పోయి.. సంక్షామం నెలకొనిందని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వెన్నుపోటు దినం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తిలోని ఆ పార్టీ కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, నాయకులు కార్యకర్తలు నిరసన తెలిపారు. అనంతరం పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా ఆర్డీఓ కార్యాలయం వద్దకు చేరుకుని, డిప్యూటీ తహసీల్దార్ శాంతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల సమయంలో అధికారమే లక్ష్యంగా చంద్రబాబు నాయుడు మోసపూరిత హామీలను



శ్రీకాళహస్తిలో నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు

గుప్పించారన్నారు. సూపర్ సిక్స్ అంటూ బూటకపు మేనిఫెస్టోను తీసుకువచ్చి, అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆర్థిక స్థితి బాగోలేదంటూ మేనిఫెస్టోను మూలన పడేశారని తెలిపారు. అభివృద్ధిని అటకెక్కించే సంక్షేమ పథకాలను గాలికి వదిలేశారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వాలు తప్పు చేసినా, సామాన్య ప్రజలకు అన్యాయం జరిగినా స్పందించి, ప్రశ్నిస్తానన్నా పవన్ కళ్యాణ్ ఏమయ్యారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం పాలన ఏడాది గడుస్తున్న ప్రజలకు చిల్లి గవ్వ చేతికిందలేదని, ప్రజల పక్షాన నిలుస్తున్న వారిపై దాడులు దౌర్జన్యాలు కేసులు అరెస్టులతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. శ్రీకాళహస్తిలో ఇసుక మాఫియా పెరిగిపోయి ఉచిత ఇసుక అంటూ ఊదరగొట్టి పచ్చమూకలకు ప్రకృతి వనరులను అప్పగించేశారని ఆరోపించారు. సీసీ రోడ్లు, భవనాలు, పంచాయతీ పనులు, ఆర్ అండ్ బి,గనుల కాంట్రాక్టు వంటి పనులను తెలుగు తమ్ములకు కట్టబెట్టి ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టారని తెలిపారు. శ్రీకాళహస్తిలో ఎప్పుడూ లేనివిధంగా కొత్త రాజకీయానికి తెరదీశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎన్నికల వరకే ప్రత్యర్థులుగా చూసేవారమని, ఆ తర్వాత ప్రతి ఒక్కరికీ పనిచేసి అందరూ బాగుండాలని కోరుకున్నామని, కానీ నేడు శ్రీకాళహస్తిలో ఆ పరిస్థితి లేదన్నారు. ఇలాగే ఓ నూతన ఒరవడికి శ్రీకారం చుడితే రేపు అధికారంలోకి వచ్చేది తామేనని, అప్పుడు తాను చెప్పినా తమ కార్యకర్తలు తన మాట వినే పరిస్థితి ఉండకపోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి దేవస్థానం పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ నేతలు వయ్యాల కృష్ణారెడ్డి, ఓడూరు గిరిధర్ రెడ్డి, బర్రె సుదర్శన్ రెడ్డి, గున్నేరి కిషోర్‌రెడ్డి, కూనాటి రమణయ్య యాదవ్, గంగారి రమేష్, చెవిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, హరి ప్రసాద్ రెడ్డి, పగడాల రాజు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఏడాది పాలనలో సంక్షేమానికి సమాధి



వరదయ్యపాళెంలో ర్యాలీ చేస్తున్న నూకతోటి రాజేష్ వైఎస్సార్‌సీపీ శ్రేణులు

వరదయ్యపాళెం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సంక్షేమానికి సమాధి కట్టిందని, అధికారం చేపట్టి ఏడాది పూర్తయినప్పటికీ ఒక పథకం కూడా అమలు చేయకుండా కాలయాపన చేస్తూ ప్రజలను నమ్మించి వెన్నుపోటు పొడిచిన ఘనత చంద్రబాబు ప్రభుత్వానికే దక్కిందని వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు ఆ పార్టీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ఆధ్వర్యంలో సత్యవేడు నియోజకవర్గం వరదయ్యపాళెం మండలం కేంద్రంలో నిర్వహించిన వెన్నుపోటు దినం కార్యక్రమం విజయవంతమైంది. వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు, ప్రజా ప్రతినిధులు పెద్ద ఎత్తున తరలి వచ్చి మద్దతు పలికారు. తొలుత వరదయ్యపాళెం బస్టాండ్ ఆవరణలోని వైఎస్సార్ విగ్రహానికి నూకతోటి రాజేష్, పార్టీ శ్రేణులతో కలిసి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడ నుంచి పార్టీ శ్రేణులు, ప్రజలు ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని, అక్కడ జూనియర్ అసిస్టెంట్ మల్లికార్జునకు ఎన్నికల హామీలు అమలు చేయకపోవడంపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నూకతోటి రాజేష్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలు జాడ లేకుండా పోయిందన్నారు. మహిళలకు ఉచిత బస్ ప్రయాణం హామీ ఇంకా రోడ్డు ఎక్కలేదని, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్ల హామీ ఒక్క నెలకే పరిమితమై మంటల్లో కలిసిపోయిందన్నారు. విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు చెల్లించిన దాఖలాలు లేవన్నారు. ఖరీఫ్ సీజన్ ముంచుకొస్తున్నా రైతులకు విత్తనాలు మందులు దొరకని పరిస్థితి ఉందన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ క్యాలెండర్‌ను సక్రమంగా అమలు చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్మిక విభాగం మాజీ కన్వీనర్ బీరేంద్రవర్మ, పార్టీ కన్వీనర్లు నాయుడు దయాకర్ రెడ్డి (వరదయ్యపాళెం), సుశీల్ కుమార్ రెడ్డి (సత్యవేడు), మణి నాయుడు (బీఎన్‌కండ్రిగ), గవర్ల కృష్ణయ్య (కేవీబీపురం), అపరంజిరాజు (నాగలాపురం), చలపతిరాజు (పిచ్చాటూరు), సొరకాయలు (నారాయణవనం), ఉమ్మడి చిత్తూరు జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ వేలూరు రాకేష్, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధికార ప్రతినిధి చిన్నా, రాష్ట్ర చేనేత కార్మిక విభాగం సభ్యులు బొప్పన తిలక్‌బాబు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఏపీఎం బాలాజీ రెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గురునాథం, నియోజకవర్గ బూత్ కమిటీ కన్వీనర్ బందిల సురేష్, సత్యవేడు నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు వినోద్ యాదవ్, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు దుద్దు వేణు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మహేంద్ర, నియోజకవర్గ ప్రచార కన్వీనర్ శివా యాదవ్, నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు పెద్దిరెడ్డి మల్లికార్జునరెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర యూత్ కార్యదర్శి శిబిచక్రవర్తి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు మస్తానమ్మ, నాయకులు దామోదర్ రెడ్డి, నందకుమార్, హరిశ్చంద్రారెడ్డి, కేవీ భాస్కర్ నాయుడు, ఎంపీపీ దివాకర్ రెడ్డి, మైనారిటీ సెల్ నాయకుడు అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బంగారమ్మ నిమజ్జనం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా పిచ్చాటూరు రోడ్డులో ఉన్న బంగారమ్మ ఆలయంలో జరుగుతున్న జాతరలో భాగంగా బుధవారం బంగారమ్మ నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తొలుత అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అభిషేక పూజలు చేసి, విశేషాలంకరణ చేశారు. ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. తరువాత అమ్మవారి ముగ్గు వేశారు. సాయంత్రం 4 గంటలకు కుంభం వేశారు. 6 గంటలకు బంగారమ్మ అమ్మవారి ఉత్సవమూర్తిని పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం నిమజ్జన కార్యక్రమం వేడుకగా నిర్వహించారు. అంతకు ముందు శ్రీకాళహస్తీశ్వరాలయం తరఫున ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బొజ్జల బృందమ్మ ముక్కంటి సారెను అందజేశారు. .



ఊరేగుతున్న బంగారమ్మ ఉత్సవమూర్తి

ముక్కంటి సేవకులకు న్యాయం చేయండి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో సేవ చేసే కార్మికులకు న్యాయం చేయాలని డీసీసీ అధ్యక్షుడు బాల గురవం బాబు, కాంగ్రెస్ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆలయంలో పనిచేస్తున్న సేవకులు తమకు జరిగిన అన్యాయంపై వారిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాల గురవంబాబు మాట్లాడుతూ ముక్కంటి ఆలయంలో పనిచేసే సేవకులు వివరాలను తెలుసుకున్నారు. వారి తరఫున న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని తెలిపారు. తలపా దామోదర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా పనిచేస్తున్న సేవలకు ఉన్న పళంగా నిలిపివేయడంతో వారి కుటుంబాల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. కోర్టులో వారికి అనుకూలంగా స్టే ఉన్నా ఆలయ అధికారులు న్యాయం చేయకపోగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ వారికి అండగా ఉండి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కరీముల్లా, సురేంద్రరెడ్డి, ఆంటోని, నవీన్, కరీముల్లా, పఠాన్ అల్తాఫ్, బబ్లు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున ముక్కంటి సేవకులు

విద్యుత్ అంతరాయం

సత్యవేడు: సబ్‌స్టేషన్ పరిధిలోని సత్యవేడు పంచాయతీ బీసీ కాలనీలో గురువారం ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ సిబ్బంది తెలిపారు. బీసీ కాలనీ పరిధిలో విద్యుత్ స్తంభాలకు అడ్డంగా ఉన్న చెట్లు, లైన్ క్లియరింగ్ పనులు చేస్తున్నందున ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా కట్ చేస్తున్నట్లు తెలిపారు.

బోర్డు వెల వెల.. దారి ఎలా?



రంగు వెలిసిన రేణిగుంట పీహెచ్‌సీ బోర్డు

రేణిగుంట: పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం బోర్డు వెలవెల పోయింది. దీంతో చికిత్స కోసం వచ్చే కొత్తవారు పీహెచ్‌సీ చిరునామా తెలుసుకోలేక ఇక్కట్లు పడుతున్నారు. రేణిగుంట అన్నస్వామిపల్లి రహదారిలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనం రోడ్డుకు కొంతదూరంలో లోపల ఉంది. మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చే కొత్తవారు చికిత్స నిమిత్తం హాస్పిటల్ వెళ్లాలని వచ్చి, ప్రధాన రహదారిలో ఉన్న బోర్డులో అక్షరాలు సరిగ్గా కనిపించకపోవడంతో ఇక్కట్లు పడుతున్నారు. చివరకు స్థానికులను అడిగి అడ్రస్ తెలుసుకొని వెళుతున్నారు. హాస్పిటల్ నిర్వహణకు ఎంతో ఖర్చు చేస్తున్న వైద్యాధికారులు బోర్డును మర్చిపోవడం విడ్డూరంగా ఉందని, ఇకనైనా నూతన బోర్డును ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ముత్యపు పందిరిలో తేజోమూర్తి

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా మూడవ రోజు బుధవారం రాత్రి స్వామివారు ముత్యపు పందిరి వాహనంపై విహరించారు. ఈ సందర్భంగా ఉదయం సింహవాహనంపై స్వామివారు ఊరేగారు. 10 నుంచి 11 గంటల వరకు దేవదేవేరులకు స్నపన తిరుమంజనం వేడుకగా చేపట్టారు.

ఘనంగా హోమ పూజలు

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేటలో ఉన్న శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రమణ్యస్వామి ఆలయ పంచాహ్నిక నూతన రాజగోపుర కలశ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా బుధవారం అంకురార్పణ, కలశ స్థాపన, హోమపూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపకులు మురగప్ప మొదలి ఆధ్వర్యంలో ఆలయంలో స్వామి,అమ్మవార్లకు అభిషేక పూజలు చేసి విశేషంగా అలంకరించారు. ఈనెల 8వ తేదీ ఆదివారం రాజగోపుర కలశ ప్రతిష్ఠ, మహాకుంభాభిషేకం, గ్రామోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని మురగప్ప మొదలి చెప్పారు.

ఉత్సవాలకు సర్పంచ్ రూ.55వేలు విరాళం

ఉత్సవాల సందర్భంగా బుధవారం ఆలయాన్ని దర్శించుకున్న పాపానాయుడుపేట సర్పంచ్ మేకళత్తూరు లలితాకరుణాకరన్ ఉత్సవాలకు రూ.55 వేలు తన వంతుగా విరాళం అందజేశారు. మాజీ సర్పంచ్ తంబా సుబ్రమణ్యం మొదలి పాల్గొనగా, వారికి ఉత్సవ నిర్వాహకులు ప్రత్యేక దర్శనం చేయించి శేషవస్త్రాలతో ఘనంగా సత్కరించారు.



విరాళం అందజేస్తున్న సర్పంచ్ లలితాకరుణాకరన్

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

నారాయణవనం: యాజమాన్య పద్ధతులు పాటిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ, వ్యవసాయ పరిశోధన మండలి, రాస్ కృషి విజ్ఞాన్ కేంద్రం సంయుక్తంగా బుధవారం మండలంలో కీళగరం, సముదాయం, భీములుచెరువు, నారాయణవనంలో సమావేశాలు నిర్వహించారు. శాస్త్రవేత్తలు దివ్య సుధ, డాక్టర్ భారత్ కుమార్ మాట్లాడుతూ మోతాదుకు మించి రసాయనాలను వాడకుండా భూసారాన్ని రక్షించుకుంటూ, నాణ్యమైన విత్తనాలతో మేధావుల సూచనలు, సలహాల పాటించి, సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని చెప్పారు. వాతావరణ, మట్టి స్వభావానికి అనుగుణంగా పంటల సాగు చేయాలన్నారు. పెరటి పంటలుగా ఆకుకూరలు, కూరగాయలు, పూల సాగుపై మహిళలు ప్రత్యేక శ్రద్ధ చూపి, ఆర్థికంగా స్వావలంబన పొందాలని మండల వ్యవసాయ అధికారి శోభారాణి అన్నారు. పంట బీమాకు రైతులు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఉద్యానవన పంటలైన పండ్లు, పూల సాగుకు ఉపాధి హామీ పథకంలో ఆర్థిక సాయం పొందవచ్చునని ఉద్యానవన అధికారి సౌజన్య తెలిపారు. ఈ సమావేశాల్లో సర్పంచ్ సుబ్రమణ్యంరెడ్డి, విజయ, పశువైద్యాధికారులు భార్గవి, నరేష్, గౌరి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శోభారాణి

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కుక్కంబాకం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 81లోని ప్రభుత్వ భూమిలో బుధవారం తహసీల్దార్ శ్రీదేవి బోర్డును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుక్కంబాకం గ్రామ రెవెన్యూలోని సర్వే నంబర్ 81లో 1.82 ఎకరాల ప్రభుత్వ భూమిని ఉందన్నారు. ఈ భూమిని ప్రజల ప్రయోజనార్థం కేటాయించారని తెలిపారు. ఈ భూమిని ఆక్రమించినా, ప్రవేశించిన చట్టరీత్యా శిక్షార్హులని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో జయలక్ష్మి, సర్వేయర్ వాసు, తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

అదుపు తప్పి బస్సును ఢీకొన్న ద్విచక్ర వాహనం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని విజయగోపాలపురం వద్ద శ్రీకాళహస్తి–తడ వైపు వెళుతున్న బస్సును ఓ ద్విచక్రవాహనం అదుపు తప్పి ఢీ కొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా, ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. గ్రామస్తుల కథనం మేరకు.. మండలంలోని కాటూరు గ్రామానికి చెందిన ఆకాష్, విష్ణు, చందు బుధవారం బుచ్చినాయుడుకండ్రిగకు షాపింగ్‌కు వచ్చారు. షాపింగ్ చేసుకుని కాటూరుకు తిరుగు ప్రయాణమయ్యారు. విజయగోపాలపురం వద్ద గ్యాస్ పైప్ లైన్ పనులు చేస్తున్న జేసీబీ, క్రేన్‌లు రోడ్డుపై ఉండడంతో ఎదురుగా వస్తున్న బస్సు కనిపించక బస్సును ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ఘటనలో ఆకాష్, విష్ణు తీవ్ర గాయాలు కాగా, చందుకు స్వల్పగాయాలయ్యాయి. గాయపడిన ఆకాష్, విష్ణును 108 అంబులెన్స్‌లో శ్రీకాళహస్తిలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు.



గాయపడిన విష్ణు

యథేచ్ఛగా ఇసుక దందా

- టిప్పర్లతో ఇసుక తరలింపు
- కానరాని పోలీస్ రెవెన్యూ మైనింగ్ అధికారులు



ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్



ఇసుకను ట్రాక్టర్లకు లోడ్ చేస్తున్న జేసీబీ

రేణిగుంట: కలెక్టరేట్‌కు 6 కిలోమీటర్ల దూరం, గాజుల మండ్యం పోలీస్ స్టేషన్‌కు కిలోమీటర్ దూరంలో రేయింబవళ్లు తేడా లేకుండా ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. అడ్డుకోవాల్సిన అధికార యంత్రాంగం, కూటమి నాయకులకు భయపడుతూ మామూళ్ల మత్తులో జోగుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

రేణిగుంట మండలం ఎల్లమండ్యం పంచాయతీలోని పిల్లపాళెం సమీపంలో ఉన్న స్వర్ణముఖి నది తీరంలో విచ్చలవిడిగా ఇసుక అక్రమంగా తవ్వకాలు జరుపుతున్నారు. గత ఎన్నికల్లో నూతన ప్రాంతీయ పార్టీ తరఫున శ్రీకాళహస్తి నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన స్థానిక వ్యక్తి, స్థానిక అధికార పార్టీ నాయకులతో కుమ్మక్కై ఇసుక అక్రమ దందా కొనసాగిస్తున్నారు. సుమారు 20 అడుగుల లోతు వరకు ఇసుకను జేసీబీతో తవ్వి, ట్రాక్టర్లతో స్టాక్ పాయింట్‌కు చేర్చి, అక్కడ నుంచి టిప్పర్లతో పొరుగు రాష్ట్రాలకు తరలిస్తున్నట్లు సమాచారం. బుధవారం మధ్యాహ్నం జేసీబీ, ట్రాక్టర్లు, టిప్పర్లతో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా సాగించారు. ఇదంతా పోలీస్ స్టేషన్ సమీపంలోని ప్రధాన కూడలి నుంచే సాగుతున్నా పోలీసులు ఆ వాహనాలను ఆపే ధైర్యం చేయలేకపోతున్నారు. ఇలా గత సంవత్సరం రోజుల్లో రూ.కోట్ల విలువ చేసే ఇసుకను పొరుగు రాష్ట్రాలకు తరలించారు.

మామూళ్లు ఇస్తున్నాం మనకేంటి భయం

ఇసుక అక్రమ తవ్వకాలు జరిపే ప్రదేశంలో ఉంటున్న వ్యక్తులు అందరి అధికారులకు మామూళ్లు ఇస్తునామని, వీళ్ల ఫొటోలు తీసుకుంటే మనకేంటి భయం, మీరు తవ్వకాలు జరపండని అంటున్నారు. అక్కడే తమ మనుషులను పహారా పెట్టి స్థానికులు ఎవరైనా అటు వైపు వెళ్లి ప్రశ్నిస్తే, వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. దీంతో స్థానికులు కనీసం నోరు విప్పేందుకు కూడా భయపడుతున్నారు. అధికారుల దృష్టికి తీసుకు వెళితే తమకు తెలియదు, పరిశీలిస్తాం, చర్యలు తీసుకుంటాం అనే సమాధానాలు చెబుతున్నారే తప్ప, అటువైపు వెళ్లడం లేదు. ఇలాగే ఇసుక తవ్వకాలు కొనసాగితే కొద్ది రోజుల్లోనే రేణిగుంట మండలంలో ఇసుక కనుమరుగయ్యే ప్రమాదం పొంచి ఉంది. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



స్టాక్ పాయింట్ వద్ద ఉన్న టిప్పర్